
సాక్షి పల్నాడు

శనివారం | 16 | డిసెంబర్ | 2023



వీల్‌చైర్ల బహుకరణ

గుంటూరు ఎడ్యుకేషన్: విభిన్న ప్రతిభాంతులైన ఇద్దరు చిన్నారులకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి వైవీఎస్‌బీజీ పార్థసారథి, సీనియర్ సివిల్ జడ్జి టి.లీలావతి శుక్రవారం వీల్‌చైర్లు అందించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 522.40 అడుగుల వద్ద ఉంది. ఎస్‌ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది.

ఎస్‌ఈబీ ఏఎస్పీకి ఉద్యోగోన్నతి



నగరంపాలెం: గుంటూరు ఎస్‌ఈబీ ఏఎస్పీ డీఎన్ మహేష్‌కు నాన్ కేడర్ ఎస్పీగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ విజయవాడ ఏసీబీ ఎస్పీగా ప్రభుత్వం బదిలీ చేసింది.

న్యూస్‌రీల్

అమరజీవి త్యాగశీలి



నరసరావుపేట: ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ప్రాణాలర్పించిన త్యాగశీలి అమరజీవి పొట్టి శ్రీరాములు అని జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాం ప్రసాద్ కొనియాడారు. శుక్రవారం పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. స్వాతంత్ర్య సమరంలోనూ శ్రీరాములు పాత్రను కీర్తించారు. కార్యక్రమంలో డీఆర్వో కె.వినాయకం, డీడీవో మహాలక్ష్మి, రెడ్‌క్రాస్ సభ్యులు బత్తుల మురళి, విద్యార్థులు పాల్గొన్నారు.

అమరేశ్వరునికి రజత నాగాభరణం సమర్పణ



అమరావతి: అమరావతిలోని అమరేశ్వరునికి శుక్రవారం రజత నాగాభరణం సమర్పించారు. ఒంగోలు పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారస్తుడు గ్రంధి నాగభాస్కర్, శిరీష దంపతులు స్వామివారి ముందు భాగాన ప్రతిష్ఠించిన బాణచర లింగాకారానికి వెండి నాగాభరణం సమర్పించారు. సుమారు రూ.90 వేల విలువైన నాగాభరణానికి శుక్రవారం ఆలయంలో సంప్రోక్షణ కార్యక్రమం నిర్వహించి ఈఓ వేమూరి గోపీనాథశర్మకి అప్పగించారు. అనంతరం అర్చకుల ద్వారా స్వామి వారికి అలంకరించారు. తొలుత దాతలు స్వామివారికి అభిషేకం, బాలచాముండేశ్వరి అమ్మవారికి కుంకుమపూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

జిల్లాలో కంది దిగుబడి 40,345 క్వింటాళ్లు

జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్



నరసరావుపేట: జిల్లాలో 40,346 క్వింటాళ్ల కంది దిగుబడి వచ్చే అవకాశం ఉందని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కందుల సేకరణపై జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. 2023–24కు క్వింటాలు రూ.7వేలు మద్దతు ధర ఉందన్నారు. ఖరీఫ్ కాలంలో రైతులు 17,326 హెక్టార్లు, రబీలో 3,017 హెక్టార్లలో సాగు చేశారన్నారు. పంట కోత జనవరి చివరి వారం నుంచి ప్రారంభమై మార్చి నాల్గవ వారంతో ముగుస్తుందన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా కందిపంట కొనుగోలు చేసేందుకు గోనె సంచులు, రవాణా వాహనాలు వివరాలు, సిబ్బంది లభ్యతపై ఆరా తీశారు. కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించిన కందులను మిల్లింగ్ చేసేందుకు తగిన బ్యాంకు గ్యారంటీలను సమర్పించేందుకు సిద్ధంగా ఉండాలని పప్పుల మిల్లర్లను కోరారు. పౌరసరఫరాల జిల్లా మేనేజర్ జి.వరలక్ష్మి, జిల్లా అధికారి ఎస్.పద్మశ్రీ, జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి, పప్పుల మిల్లర్లు పాల్గొన్నారు.

యార్డుకు 45,961 బస్తాల మిర్చి



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 43,224 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 45,961 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.23,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,500 నుంచి 25,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.10,000 నుంచి రూ.22,000 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.10,000 నుంచి 24,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.13,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 20,115 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.


పునరావాసం.. పునరుత్తేజం

త్యాగాలకు చిరు కానుక

- పులిచింతల నిర్వాసితుల ఇళ్లు, ప్లాట్లకు రిజిస్ట్రేషన్, స్టాంప్ డ్యూటీ రూ.60 కోట్లు మినహాయింపు
- 12 ఆర్‌అండ్‌ఆర్ సెంటర్లలో లబ్ధి పొందనున్న 5,376 కుటుంబాలు
- ఫలించిన రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు కృషి
- సంబరాల్లో లబ్ధిదారులు

జన్మభూమి అంటే కేవలం ఊరు కాదు .. అది అనుబంధం. అలాంటి సొంత ఊరితో ఉన్న మమకారాన్ని తెంచుకుని వేరే ప్రాంతానికి వెళ్లడమంటే.. విడిపోని జ్ఞాపకాలను గుండెల్లో మూటకట్టుకుని భారంగా పయనమవ్వడమే.. భావి ప్రయోజనాల కోసం డాక్టర్ కేఎల్ రావు సాగర్ (పులిచింతల) ప్రాజెక్టు కోసం నిర్వాసితులు ఇలాంటి త్యాగమే చేశారు. కన్న ఊరిని వదిలి నిర్వాసిత ప్రాంతాలకు పయనమయ్యారు. వారికి ప్రభుత్వం కూడు, గూడు వంటి సౌకర్యాలు కల్పించినా ఏదో వెలితి. తమ కంటూ సొంత భూమి ఉందనే భరోసా లేక వేదన. అలాంటి వారందరి త్యాగాలకు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు విన్నపంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పట్టం కట్టారు. వారికి కేటాయించిన ప్లాట్లు, ఇళ్ల రిజిస్ట్రేషన్‌కు అనుమతివ్వడంతోపాటు స్టాంప్ డ్యూటీ ఫీజు మినహాయిస్తూ కానుక ఇచ్చారు. దీంతో పునరావాస కేంద్రాల ప్రజలు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, మంత్రి అంబటికి కృతజ్ఞతలు చెబుతున్నారు.

సత్తెనపల్లి: బెల్లంకొండ మండలంలో పులిచింతల ప్రాజెక్టుకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 2005లో శంకుస్థాపన చేశారు. ప్రాజెక్టు పరిధిలోని ముంపు గ్రామాలను గుర్తించి ఆయా గ్రామాల్లోని ప్రజల కోసం 12 ఆర్ అండ్ ఆర్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వాటిల్లో సత్తెనపల్లి నియోజకవర్గంలోని రాజుపాలెం మండలం రెడ్డిగూడెం, రాజుపాలెం, కొత్తబోధనం (చౌటపాపాయపాలెం), కొండమోడు (పార్వతిపురం), పెదకూరపాడు నియోజకవర్గంలోని బెల్లంకొండ మండలం మాచాయపాలెం, బెల్లంకొండ, అచ్చంపేట మండలంలోని పెదపాలెం, రొకటిగుంట వారిపాలెం, గురజాల నియోజకవర్గంలోని మాచవరం మండలం వేమవరం, పిడుగురాళ్ళ మండలం అయ్యప్పనగర్, న్యూ ఎల్లంపల్లి, దాచేపల్లి గ్రామాల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తంగా ఈ 12 కేంద్రాల్లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఆర్ అండ్ ఆర్ పాలసీ ప్రకారం నిర్వాసితులకు పరిహారం అందించేలా చర్యలు చేపట్టారు. ఈ మేరకు మొత్తం 5,376 కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలించారు. వారికి ఇళ్లు నిర్మించారు. కొందరికి ప్లాట్లు ఇచ్చారు. ఇతర మౌలిక వసతులు కల్పించారు. అనంతరం అధికారం చేపట్టిన టీడీపీ ప్రభుత్వం వీరి గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు.



కొత్త బోధనం ఆర్‌అండ్‌ఆర్ సెంటర్ ఏరియల్ వ్యూ

మంత్రి అంబటి చొరవతో..

వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టాక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పులిచింతల ప్రాజెక్టు నిర్మాణానికి శరవేగంగా చర్యలు చేపట్టింది. ఇదే సమయంలో ప్రాజెక్టు నిర్వాసితులకు అవసరమైన పరిహారం, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రణాళిక రూపొందించింది. ఈ పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టింది. అనంతరం సత్తెనపల్లి ఎమ్మెల్యే అంబటి రాంబాబు జలవనరుల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే పులిచింతల ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ క్రమంలో పునరావాస కేంద్రాల్లో ఇళ్లు, ప్లాట్లు తీసుకున్న వారు.. వాటిని విక్రయించుకునేందుకుగానీ, బ్యాంకుల్లో రుణాలు పొందేందుకు గానీ వీలు లేకపోవడంతో నిర్వాసితులు ఈ విషయాన్ని మంత్రి అంబటి దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమస్యను మంత్రి అంబటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు.

5,376 కుటుంబాలకు లబ్ధి

సత్తెనపల్లి, పెదకూరపాడు, గురజాల నియోజకవర్గాల్లోని 12 పునరావాస కేంద్రాల్లో 5,376 కుటుంబాలు ఉన్నాయి. ఈ కుటుంబాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్‌కు అనుమతితోపాటు స్టాంప్ ఫీజు మినహాయించారు. దీంతో నిర్వాసిత కుటుంబాలు సంబరాలు చేసుకుంటున్నాయి. 12 ఆర్‌అండ్‌ఆర్ సెంటర్ల లబ్ధిదారులు ఆదివారం సమావేశమై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి, మంత్రి అంబటిని సత్కరించుకుని కృతజ్ఞతలు తెలపనున్నారు.

దీంతో ప్రభుత్వం ఈనెల 13న ఆర్ అండ్ ఆర్ నిర్వాసితుల ప్లాట్లు, ఇళ్ల రిజిస్ట్రేషన్‌కు అనుమతితోపాటు, స్టాంపు డ్యూటీ రూ.60 కోట్లు మినహాయిస్తూ జీవో నంబర్ 586 విడుదల చేసింది.

నిర్వాసితులకు మేలు



నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యేగా ఎన్నికైన నాటి నుంచి కృషి చేస్తున్నా. సీఎం జగన్ కూడా ప్రత్యేకంగా దృష్టిసారించారు. ఏ విషయం విన్నవించినా సానుకూలంగా స్పందించారు. రిజిస్ట్రేషన్లకు అనుమతివ్వడం తోపాటు స్టాంప్ డ్యూటీ మినహాయింపు నిర్ణయం చారిత్రాత్మకం. సువర్ణాధ్యాయం. చాలా ఆనందంగా ఉంది.

– అంబటి రాంబాబు,
రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి

మంచి నిర్ణయం



నిర్వాసితులకు కేటాయించిన ప్లాట్లు, ఇళ్లపై యాజమాన్య హక్కులు కల్పించడం మంచి నిర్ణయం. రిజిస్ట్రేషన్‌పై స్టాంప్‌డ్యూటీ మినహాయించడం భేష్. ఇది చారిత్రాత్మకం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వాసితుల పక్షాన నిలిచారు. ఆయన మేలు మరిచిపోలేనిది.

– నంబూరు శంకరరావు,
ఎమ్మెల్యే, పెదకూరపాడు

ఆపద వస్తే ఇబ్బందులు తప్పేవి కావు



పులిచింతల ప్రాజెక్ట్ కోసం ఊరిని వదులుకోక తప్పలేదు. ఆర్‌అండ్‌ఆర్ సెంటర్‌లో మాకు ఆపద వస్తే ఆలకించేవారేలేరు. ఆర్థిక అవసరాలు వస్తే వడ్డీ వ్యాపారులను ఆశ్రయించినా ఆస్తులు ఏమి ఉన్నాయని అడిగేవారు. ఆర్‌అండ్‌ఆర్ సెంటర్‌లోని ప్లాట్లు, ఇళ్ల కొనుగోలు, అమ్మకాలు లేక ఇబ్బందులు తప్పేవి కావు. ఇప్పుడు ఆ సమస్య తొలగిపోయింది. మా సమస్యను పరిష్కరించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, మంత్రి అంబటికి కృతజ్ఞతలు.

–పాలవాయి.ఆదినారాయణ,
ఆర్‌అండ్‌ఆర్ సెంటర్,రాజుపాలెం

భరోసా కల్పించారు



పులిచింతల నిర్వాసితులమైనప్పటికీ మాకు కూడా ఒక ఆస్తి ఉందనే భరోసా ప్రభుత్వం కల్పించింది. నాకు ఇద్దరు కుమారులు, ప్రాథమికోన్నత విద్యను అభ్యసిస్తున్నారు. మాకు ఏదైనా కష్టం వస్తే రుణాలు పొందే అవకాశం హక్కుగా కల్పించారు. ప్రభుత్వానికి భారమైనప్పటికీ మాకు న్యాయం చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి అంబటి రాంబాబు మేలును ఎప్పటికీ మరువలేం.

–సరిమెళ్ల వెంకటరెడ్డి,
ఆర్‌అండ్‌ఆర్ సెంటర్, రెడ్డిగూడెం

చాలా సంతోషంగా ఉంది.



పులిచింతల ప్రాజెక్టు కోసం సొంత ఊరిని వదిలి వచ్చాం. అప్పట్లో వైఎస్ రాజశేఖరరెడ్డి అడిగారని వచ్చేశాం. ఆ తర్వాత వచ్చిన టీడీపీ ప్రభుత్వం మా సమస్యలు పట్టించుకోలేదు. మంత్రి అంబటి రాంబాబు దృష్టికి తీసుకెళ్ళగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో చర్చించి న్యాయం చేశారు. ఎన్నో ఏళ్లనాటి మా సమస్యలు పరిష్కరించేదుకు జీవో విడుదల చేశారు. ఇప్పుడు మాకు ఇచ్చిన ప్లాట్లు, ఇళ్లకు రిజిస్ట్రేషన్ అనుమతి, స్టాంప్ డ్యూటీ ఫీజు మినహాయించారు. సంతోషంగా ఉంది.

–పాశం మహాలక్ష్మమ్మ,
ఆర్‌అండ్‌ఆర్ సెంటర్, కొత్త బోధనం

కోడిపోరు.. ఉత్సవ జోరు

- కాలుదువ్విన పల్నాటి పౌరుషం
- నాలుగోరోజు వీరారాధనోత్సవాలు
- వీరాచారవంతుల నృత్యాలు

కారెంపూడి: పల్నాటి వీరారాధన ఉత్సవాలలో భాగంగా నాలుగోరోజు శుక్రవారం కోడిపోరు వైభవంగా సాగింది. పల్నాటి పౌరుషం కాలుదువ్వింది. వీరుల గుడి నుంచి వేకువ జామునే పల్నాటి వీరుల ఆయుధాల (దైవాలు)తో వీరాచారవంతులు గ్రామోత్సవానికి బయలు దేరారు. దైవాల ముందు నృత్యాలు చేస్తూ వీరంగమాడారు. యథాప్రకారం చెన్నకేశవస్వామి, అంకాలమ్మ తల్లి దర్శనం చేసుకుని ఉత్తరంగా ఉన్న వీధి నుంచి బ్రహ్మనాయుడు మేడ వద్దకు చేరుకున్నారు. అక్కడ ప్రజలు ముందుగా పసుపునీళ్లతో వారుపోసి వీరాచారవంతుల కాళ్లపై నీళ్లు చల్లి, పల్నాటి వీరుల ఆయుధాలకు పూలమాలలు వేసి కొబ్బరి కాయలు కొట్టి దక్షిణలు సమర్పించారు. శనివారం అర్ధరాత్రి దాటేంత వరకు గ్రామోత్సవం కొనసాగింది. వీరంగాలు తప్ప కత్తి సేవలు కన్పించలేదు. పల్నాటి వీరుల ఆయుధాలతో తరలివచ్చి అంకాలమ్మ, చెన్నకేశవ స్వామికి మొక్కులు చెల్లించే కార్యక్రమాలు జరిగాయి. వీరాచారవంతుల చేతుల్లో కోడి పుంజులు దర్శనమిచ్చాయి. పొట్టేళ్ల అంకాలమ్మ గుడి వైపు నడిచాయి. ప్రతి మహిళ నెత్తిపై బోణం కన్పించింది. వీరాచారుల కుటుంబాలు తమ ఆచార వ్యవహారాలు నెరవేర్చుకునే పనిలో నిమగ్నమయ్యారు. ప్రజలు కూడా గ్రామోత్సవానికి వస్తున్న దైవాల కోసం రాత్రంతా మేలుకుని ఇంటి ముందు పూజా సామగ్రితో నిల్చున్నారు. వీరుల ఆయుధాల ముందు మహిళలు దేవతలు ఆవహించినట్లు ఊగిపోయారు. శనివారంతో ఉత్సవాలు ముగియనున్న నేపథ్యంలో చివరిరోజు వీరులు కళ్లికి ఒరుగు క్రమం ఉండడంతో వీరాచారవంతులంతా శుక్రవారం తమ వీరాచారం నెరవేర్చుకుని అంకాలమ్మ, చెన్నకేశవస్వామికి మొక్కులు చెల్లించారు.



గ్రామోత్సవంలో వీరాచారుల వీరంగం

రసవత్తరంగా కీలక ఘట్టం

ఇదిలా ఉంటే వీరుల గుడి ఆవరణలో అలనాడు బ్రహ్మనాయుడు, నాగమ్మల మధ్య జరిగిన కోడి పోరును సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, కొమ్మారెడ్డి చలమారెడ్డి, వైఎస్సార్ సీపీ మండల నాయకులు పాల్గొని కోడి పోరును మూడు విడతలుగా నిర్వహించారు. బ్రహ్మనాయుడు పుంజు రతనాల చిట్టిమల్లు, నాయకురాలు నాగమ్మ పుంజు శివంగి డేగల మధ్య అలనాడు జరిగిన పోరును స్మరించుకునే విధంగా ప్రదర్శన సాగింది. పల్నాటి వీర విద్యావంతులు కోడిపోరు కథాగానం చేస్తుండగా ఈ ఘట్టం జరిగింది. పీఆర్కే, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కొంగర సుబ్రమణ్యం పోరుకు పుంజులను వదిలారు. పల్నాటి వీరాచార పీఠాధిపతి పిడుగు తరుణ్ చెన్నకేశవ, నాయకురాలు నాగమ్మ వేషంలో ఉన్న ఆచారవంతుడు ఊరేగింపుగా కోడిపోరు ప్రాంగణానికి పల్నాటి వీరుల ఆయుధాలతో తరలివచ్చారు. కోడిపోరుకు ముందుగా పీఆర్కే, చలమారెడ్డి వీరుల గుడికి వెళ్లి వీరుల ఆయుధాలకు పూజలు చేసి అనంతరం కోడిపోరు ప్రదర్శనలో పాల్గొన్నారు. కోడిపోరు ముగిసిన తర్వాత వినుకొండ మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు వీరుల గుడిలో పల్నాటి వీరుల ఆయుధాలకు పూజలు చేశారు. కోడిపోరుకు వేలాదిగా ప్రజలు తరలివచ్చారు. పల్నాటి వీరాచార పీఠం నిర్వాహకుడు విజయ్‌కుమార్ కోడిపోరుకు హాజరైన పెద్దలను సన్మానించారు.



కోడిపోరులో కోడి పుంజుతో పాల్గొన్న ప్రభుత్వ విప్ పీఆర్కే, పీఠాధిపతి తరుణ్ చెన్నకేశవ

‘తాపీ’గా బైక్ చోరీలు

- వృత్తి తాపీ పని, ప్రవృత్తి బైక్ చోరీలు
- విలాసాల కోసమే దొంగతనాలు
- పట్టుకున్న పల్నాడు పోలీసులు
- రూ. 24 లక్షల విలువైన 34 ద్విచక్రవాహనాలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న ద్విచక్రవాహనాలు

నరసరావుపేట: సుమారు రెండేళ్ల నుంచి పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాల పరిధిలో ద్విచక్ర వాహనాలను దొంగిలిస్తున్న యువకుడిని పోలీసులు అరెస్టు చేసి అతడి వద్ద నుంచి రూ.24 లక్షల విలువైన 34 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం సాయంత్రం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి వివరాలను వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. యడ్లపాడు మండలం లింగారావుపాలెంకు చెందిన 36 ఏళ్ల యూతం వీరభద్రరావు తాపీ పనులు చేస్తుంటాడు. వ్యసనాలకు బానిసైన అతను సులువుగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో చోరీల బాట పట్టాడు. 2002లో నరసరావుపేటలో సైకిల్ దొంగతనం చేసి పట్టుబడి జైలు శిక్ష అనుభవించాడు. పొలాలు, తిరునాళ్ళలో పార్క్ చేసిన మోటార్ సైకిళ్లను తాపీగా దొంగిలించడం అలవాటు చేసుకున్నాడు. పెదకూరపాడు, సత్తెనపల్లి, వినుకొండ, ఐనవోలు, పరుచూరు, మార్టూరు, ఇంకొల్లు, కాకుమాను, పొన్నూరు రూరల్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో బైక్ చోరీలకు పాల్పడ్డాడు. శుక్రవారం ఉదయం విశ్వసనీయ సమాచారం మేరకు ఉప్పలపాడు సెంటర్ వద్దకు పోలీసులు వెళ్లారు. అక్కడ బైక్‌తో ఉన్న వీరభద్రరావు పోలీసులను చూసి పారిపోయేందుకు యత్నించాడు. దీంతో ఎస్ఐ తన సిబ్బంది సహాయంతో అతడిని పట్టుకుని విచారించగా చేసిన నేరాలను ఒప్పుకున్నాడు. దొంగిలించిన మోటార్ సైకిళ్లను మధ్యవర్తుల సమక్షంలో స్వాధీనం చేసుకొని పోలీసులు అరెస్టు చేశారు. బైక్ దొంగను అరెస్టు చేయడంలో ప్రతిభ కనబరిచిన డీఎస్పీ మహేష్, సీఐ యు.సుధాకర్‌బాబు, ఎస్ఐ లక్ష్మీనారాయణరెడ్డి, హెడ్‌కానిస్టేబుళ్లు పి.రామకోటి, షేక్ ఖాసీం, కానిస్టేబుళ్లు బి.నరేంద్ర, పీవీ రామయ్య, డి.సురేష్, వై.ప్రశాంతిరెడ్డిలను ఎస్పీ అభినందించారు.

క్లుప్తంగా

సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



పిడుగురాళ్ల: పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, దివంగత మహానేత ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి చిత్ర పటాలకు పులిచింతల నిర్వాసితులు క్షీరాభిషేకం చేశారు. వారు మాట్లాడుతూ... 2011లో పులిచింతల ప్రాజెక్టు ముంపు గ్రామాల ప్రజలకు ఆర్ అండ్ ఆర్ సెంటర్ ఏర్పాటు చేసి పట్టాలను మహానేత రాజశేఖరరెడ్డి ఇచ్చారని, ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆర్ అండ్ సెంటర్‌లో రిజిస్ట్రేషన్ చేసి ఎంతో మేలు చేశారని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అతిరాస మేర కార్పొరేషన్ డైరెక్టర్ యెనుముల వెంకటేశ్వర్లు, అయ్యప్ప నగర్ మాజీ సర్పంచి గొట్టిముక్కల శివారెడ్డి, అయ్యప్ప నగర్ సర్పంచి బండి తిరుపతిరెడ్డి, కొండమోడు ఆర్ అండ్ ఆర్ సెంటర్ ఇన్‌చార్జి తోట లక్ష్మయ్య, గొబ్బూరి నరసింహారావు, అమరావతి కాశయ్య, దేశెట్టి శ్రీనివాసరావు, తోట యలమంద, ఉంగరాల కొండలు, ఆదిమూలం రామాంజనేయులు, బండి వెంకటరెడ్డి తదితరులు ఉన్నారు.

పట్టుబడిన వాహనాల వేలం

నరసరావుపేట: స్థానిక జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో ఈనెల 27న వాహనాల వేలం నిర్వహించనున్నట్లు జిల్లా రవాణాశాఖ అధికారి ఆర్.పరంధామరెడ్డి శుక్రవారం తెలిపారు. పన్ను బకాయిలు చెల్లించని, ఇతర క్రమశిక్షణ రాహిత్యం వలన వాహన తనిఖీల్లో పట్టుబడి ఆర్నెల్లుగా నిర్బంధం ఉన్న వాటిని వేలం వేయటం జరుగుతుందని చెప్పారు. 20 వాహనాలు ఉన్నట్లు చెప్పారు. ఆసక్తి ఉన్నవారు వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

రంగాను చంపిన పార్టీకి బుద్ధి చెప్పాలి

రంగా విగ్రహావిష్కరణ సభలో ప్రభుత్వ విప్ పీఆర్కే

కారెంపూడి: ప్రజల కోసం నిరాహార దీక్ష చేస్తున్న వంగవీటి మోహనరంగాను చంద్రబాబు, ఆనాటి హోం మంత్రి నడిరోడ్డుపై దారుణంగా హత్య చేయించారని, రంగాను చంపిన పార్టీ వైపు తలవంచుకుని ఎవరూ వెళ్లవద్దని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి విజ్ఞప్తి చేశారు. కారెంపూడి బస్టాండ్ సెంటర్‌లో వంగవీటి మోహన్‌రంగా విగ్రహాన్ని శుక్రవారం ఆవిష్కరించారు. పీఆర్కే మాట్లాడుతూ కొంతమంది అడ్డంకులు సృష్టించిన అధిగమించి విగ్రహాన్ని ఏర్పాటు చేయించినట్లు చెప్పారు. మాచర్ల నియోజకవర్గంలో మొదటి రంగా విగ్రహాన్ని తన చేతుల మీదగా ప్రారంభించే అవకాశం కల్పించిన కాపు మిత్రులకు ధన్యవాదాలు చెప్పారు. ఈ నెల 26వ తేదీ మాచర్ల నడిబొడ్డున వంగవీటి మోహన్‌రంగా విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. రంగాకు దివంగత ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి కుటుంబంతో సన్నిహిత్యం ఉందన్నారు. పీసీసీ అధ్యక్షుడుగా ఉన్న రాజశేఖరరెడ్డిగారి ప్రోద్బలంతో రంగా కాపు నాయకుడుగానే కాక రాష్ట్ర నాయకుడుగా దూసుకుపోయారన్నారు. అలాంటి సమయంలో ఎమ్మెల్యేగా ప్రజలకిచ్చిన మాట కోసం వారికి నివేశన స్థలాలివ్వించడం కోసం నిరాహారదీక్ష చేస్తున్న ఆయనను



మోహన్‌రంగా విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, చలమారెడ్డి

చంద్రబాబునాయుడు, హోం మంత్రి కోడెల శివప్రసాదరావు చంపించింది వాస్తవమన్నారు.

మనస్సాక్షిగా ఆలోచించండి

కాపులకు అన్ని విధాలా అండగా ఉంటానని వారికి అన్ని విధాలా గౌరవ మర్యాదలు ఎవరు ఇస్తున్నారో గమనించాలని పీఆర్కే కోరారు. కారెంపూడిలో కాపుల కల్యాణ మండపానికి కోటిన్నర విలువైన 60 సెంట్ల స్థలాన్ని కేటాయించామని కల్యాణ మండప నిర్మాణానికి కూడా రూ.20 లక్షలు కేటాయించానన్నారు. కాపు కమ్యూనిటీ హాలు నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరు చేయడం జరిగిందన్నారు. అలాగే మాచర్లలో కూడా రంగా విగ్రహం ఏర్పాటుతో పాటు కల్యాణ మండపానికి ఎకరంన్నర స్థలాన్ని కేటాయించడం జరిగిందని వివరించారు. మనసాక్షితో ఆలోచించి మంచి గౌరవ మర్యాదలు ఏ పార్టీ ఇస్తుందో గుర్తించాలని పీఆర్కే విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కొమ్మారెడ్డి చలమారెడ్డి పాల్గొన్నారు. అంతకు ముందు రూ.20 లక్షలతో నిర్మించిన కాపు కమ్యూనిటీ హాలును ప్రారంభించారు.

విద్యార్థులు పట్టుదలతో చదవాలి

ఎమ్మెల్సీ లక్ష్మణరావు

దాచేపల్లి: విద్యార్థులకు పట్టుదలతో చదవాలని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. మండలంలోని అన్ని జిల్లా పరిషత్ హైస్కూల్స్, కేజీబీవీ, ఆదర్శ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ని వారధి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం పంపిణీ చేశారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ... క్రమశిక్షణతో చదువుకోవాలని, పట్టుదల, కార్యదీక్షతో చదువుకుంటే జీవితంలో ఉన్నతమైన శిఖరాలు అధిరోహించవచ్చునన్నారు. స్టడీ మెటీరియల్ ద్వారా మంచి మార్కులు సాధించే అవకాశం



ఉందని ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఎంఈఓ రాజకుమారి, ఫౌండేషన్ వ్యవస్థాపకులు టి.ఆనంద్ కుమార్, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి వి.నాగేశ్వరరావు, యూనియన్ నాయకులు షేక్ మస్తాన్‌వలి, పి.రాజారావు, చాంద్‌బాషా, శాంతరావు, రాంబాబు పాల్గొన్నారు.

రేపు టెన్నికాయిట్ సెలక్షన్స్

నకరికల్లు: టెన్నీకాయిట్ ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టు ఎంపిక స్థానిక జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో ఆదివారం నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్.జానకిరామయ్య శుక్రవారం తెలిపారు. సీనియర్ పురుషుల, మహిళల విభాగాల్లో సెలక్షన్స్ జరుగుతాయని అన్నారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు శ్రీకాకుళంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఆసక్తి గలవారు ఒరిజినల్ ఆధార్‌కార్డు, రెండు పాస్‌పోర్టుసైజు ఫొటోలతో హాజరుకావాలని కోరారు. వివరాలకు చింతా పుల్లయ్య, ఫిజికల్ డైరెక్టర్ 98669 25108 నంబరును సంప్రదించాలని సూచించారు.

బ్యాంకర్లు రుణాలు ఇవ్వాల్సిందే

జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్

నరసరావుపేట: ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి బ్యాంకర్లు రుణాలను మంజూరు చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఏ శ్యాంప్రసాద్ కోరారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో డీసీసీ, డీఎల్ఆర్‌సీ సమావేశం నిర్వహించారు. గత సమావేశంలో బ్యాంకులకు కేటాయించి తీసుకున్న నిర్ణయాలను ఎంతవరకు అమలు చేశారో అడిగి తెలుసుకున్నారు. డీసీసీ, డీఎల్ఆర్‌సీ కన్వీనర్, యూనియన్ బ్యాంక్ రీజనల్ కోఆర్డినేటర్ డి.శంకరరావు ముఖ్య విషయాలను ప్రస్తావించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ రుణాలను తప్పనిసరిగా ఇవ్వాలని, కౌలు రైతు కార్డులు కలిగిన వారికి తప్పనిసరిగా రుణాలు మంజూరు చేయాలని సూచించారు. ఇప్పటి వరకు ఎంత మందికి రుణాలు ఇచ్చారో ఆరా తీశారు. ఇందులో వ్యవసాయ రుణాలు, అమూల్ పాల డెయిరీ, రైతు రుణాలు, పెద్ద పరిశ్రమలు, చిన్న తరహా పరిశ్రమలకు రుణాలు, డ్వాక్రా రుణాలు, వ్యక్తిగత రుణాలు ఎంతమందికి ఇచ్చారని అడిగారు. రుణాలు కొన్ని బ్యాంకులు ఇస్తున్నాయని, మరి కొన్ని ఇవ్వడం లేదని, అవకాశం ఉన్నవారికి ప్రభుత్వ అనుకూల రుణాలను మంజూరు చేయాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రుణాలు తప్పనిసరిగా అన్ని బ్యాంకులు ఇవ్వాలని సూచించారు. సమావేశంలో నాబార్డ్, ఆర్‌బీఐ బ్యాంక్‌ల ఏజీఎంలు శరత్ బాబు, అనిల్ కుమార్, ఎల్‌డీఎం రాంప్రసాద్, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి ఐ.మురళి, డీఆర్‌డీఏ పీడీ బాలు నాయక్, పశుసంవర్ధక శాఖ ఏడీ కాంతారావు, జిల్లా పరిశ్రమశాఖ అధికారి పి.వెంకటేశ్వరరావు, నవోదయం నోడల్ అధికారి కె.సంజీవరావు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు అండగా నిలవాలి

నరసరావుపేట ఈస్ట్: విభిన్న ప్రతిభావంతులలో ఆత్మస్థైర్యం నింపి వారి అభ్యున్నతిలో ప్రతిఒక్కరూ



కలెక్టరేట్‌లో బ్యాంకర్ల సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్

భాగస్వాములు కావాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ తెలిపారు. అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం విభిన్న ప్రతిభావంతులు, ట్రాన్స్‌జెండర్స్, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో డీఎస్ఏ స్టేడియంలో ఆటల పోటీలు నిర్వహించారు. పోటీలను ప్రారంభించిన జేసీ శ్యామ్‌ప్రసాద్ మాట్లాడుతూ, దివ్యాంగులలోని ప్రతిభను గుర్తించి ఆమేరకు వారిని ప్రోత్సహించాల్సిన భాద్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులపై ఉందన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ రవికుమార్, డీఆర్‌డీఏ పీడీ బాలునాయక్, డీఎస్‌డీఓ సురేష్ పాల్గొన్నారు.

ధాన్యం సేకరణపై అవగాహన

నరసరావుపేట: జిల్లా ధాన్యం సేకరణపై రైతులకు అవగాహన కలిగించేందుకు రూపొందించిన కరపత్రాలను శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ ఆవిష్కరించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ కరపత్రాల ద్వారా వ్యవసాయ, ధాన్యం సేకరణ సిబ్బంది రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో పౌరసరఫరాలశాఖ జిల్లా మేనేజర్ జి.వరలక్ష్మి, జిల్లా అధికారి ఎస్.పద్మశ్రీ, వ్యవసాయశాఖ జిల్లా అధికారి ఐ.మురళి, డీసీఎంఎస్ మేనేజర్ కొల్లి శ్రీనివాస్, మార్క్‌ఫెడ్ మేనేజర్ ఆర్.కృష్ణారావు పాల్గొన్నారు.

చేనేతలకు ప్రభుత్వం అండ

దాచేపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేనేతలకు అండగా ఉందని వైఎస్సార్ సీపీ చేనేత విభాగం నేత ముశం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. స్థానిక ఆర్అండ్‌బీ బంగ్లాలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్ చేనేతలను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నారని చెప్పారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీగా అవకాశం కల్పించి నామినేటెడ్ పదవుల్లో తగిన ప్రాధాన్యం కల్పించారని వివరించారు. మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్తగా చేనేత నాయకుడు గంజి చిరంజీవిని నియమించి తగిన గుర్తింపు ఇచ్చారని, వచ్చే ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా చేనేతలు వైఎస్సార్ సీపీకి అండగా ఉంటారని పేర్కొన్నారు. చేనేతల కోసం ప్రభుత్వం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తుందని, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు



సమావేశంలో మాట్లాడుతున్న చేనేత నేతలు

సద్వినియోగం చేసుకుని చేనేతలు రాజకీయంగా, ఆర్థికంగా బలోపేతం కావాలని కోరారు. సమావేశంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఎం.అప్పయ్య, నాయకులు చిన్నం రాము, కె.ఏడుకొండలు, బి.నర్సయ్య, వి.రామాంజనేయులు, ఎం. శ్రీనివాసరావు, కె.శ్రీనివాసరావు, ఎ.జయదేవ్, వి.శ్రీను, చిన్నం రామ్మూర్తి పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు చిరస్మరణీయుడు

నరసరావుపేట: ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ఆమరణ నిరాహారదీక్ష చేసి ప్రాణ త్యాగం చేసిన పొట్టి శ్రీరాములు చిరస్మరణీయుడని జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి కొనియాడారు. శ్రీరాములు వర్ధంతి సందర్భంగా శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పులమాల వేసి నివాళులర్పించారు. తెలుగువారికి ఒక ప్రత్యేకమైన గుర్తింపు తేవాలని ఆయన చేసిన కృషి అజరామరం అన్నారు. ఎస్పీతో పాటు అదనపు ఎస్పీ



పోలీసు కార్యాలయంలో శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్పీ

డి.రామచంద్రరాజు, ఏఆర్ డీఎస్పీ చిన్ని కృష్ణ నివాళులర్పించారు.

శివాలయ వాచ్‌మెన్‌పై భక్తుల దాడి

కేసు నమోదు చేసిన పోలీసులు

పెదకాకాని: స్థానిక శివాలయంలో విధులు నిర్వహిస్తున్న వాచ్‌మెన్‌పై భక్తులు దాడి చేయడంతో గాయపడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. భక్తుల సౌకర్యార్థం పెదకాకాని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వారి దేవస్థానంలోకి వాహనాల అనుమతిని పూర్తిగా నిలిపివేశారు. శుక్రవారం విజయవాడకు చెందిన రాహుల్ అతని కుటుంబ సభ్యులు అన్నప్రాసన కోసం వచ్చారు. అయితే గేట్ వాచ్‌మెన్ ఇల్లా రాంబాబు వాహనాలు లోనికి అనుమతి లేదని చెప్పడంతో భక్తులు మాత్రమే లోనికి వెళ్లారు. పూజా కార్యక్రమాలు ముగించుకుని తిరిగి వెళ్లే సమయంలో లోనికి స్కార్పియో వాహనం వెళ్లి భక్తులను ఎక్కించుకుని, సామానులు తీసుకుని వెంటనే వస్తామని చెప్పి లోనికి వెళ్లారు. ఎంతకీ రాకపోవడంతో వాచ్‌మెన్ పిలిచి వాహనాన్ని బయటకు పోనివ్వాలని సూచించారు. దీంతో రాహుల్ అతని కుటుంబసభ్యులు, స్నేహితులు వాచ్‌మెన్‌తో వివాదానికి దిగి అసభ్యంగా మాట్లాడటంతో పాటు కొట్టి గాయపరిచారు. అదే



చికిత్స పొందుతున్న రాంబాబు

సమయంలో వాచ్‌మెన్ రాంబాబు సోదరుడు ప్రదీప్ వెళ్లి అడ్డుకోగా అతనిపై కూడా దాడి చేశారు. అదే క్రమంలో వాహనాల పార్కింగ్ వద్ద ఉన్న వ్యక్తి పట్ల కూడా దురుసుగా ప్రవర్తించారు. సమాచారం తెలుసుకున్న ఏసీ ఎన్.శ్రీనివాస రెడ్డి పోలీసులకు సమాచారం అందించడంతో అక్కడికి చేరుకున్న పోలీసులు వాచ్‌మెన్ రాంబాబును కొట్టి గాయపరిచిన వారిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. చికిత్స నిమిత్తం రాంబాబును ఆలయ సిబ్బంది గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయడం జరుగుతుందని పెదకాకాని సీఐ బండారు సురేష్‌బాబు తెలిపారు. కాగా వాచ్‌మెన్‌పై దాడి చేసిన వ్యక్తులను వెంటనే అరెస్టు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నన్నపనేని శివాజీ డిమాండ్ చేశారు.

అదనపు గదుల నిర్మాణాలకు చర్యలు

ఏపీఈడబ్ల్యుఐడీసీ చైర్మన్ వై.నాగార్జున

తెనాలిఅర్బన్: ప్రభుత్వ పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని ఆంధ్రప్రదేశ్ విద్య, సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ (ఏపీఈడబ్ల్యూఐడీసీ) చైర్మన్ వై.నాగార్జున హామీ ఇచ్చారు. తెనాలి పినపాడులోని మున్సిపల్ అప్పర్ ప్రైమరి స్కూల్‌ను, మండల గ్రామమైన అంగలకుదురులోని జిల్లా పరిషత్ హైస్కూల్‌ను శుక్రవారం అంతర్జాతీయ క్రికెటర్ అంబటి రాయుడుతో కలసి ఆయన పరిశీలించారు. నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించి ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడారు. వారి అభిప్రాయాలను సేకరించారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యా



ర్థుల సంఖ్య పెరిగిందని, అదనపు తరగతి గదుల నిర్మాణం చేయాల్సి ఉందని ప్రధానోపాధ్యాయులు చెప్పారు. దీనిపై స్పందించిన ఆయన ఉన్నతాధికారులతో మాట్లాడి అందుకు అవసరమైన చర్యలు తీసుకునే విధంగా కృషి చేస్తామని చెప్పారు. వారి వెంట ఎంఈవో-2 జయంతి బాబు, ఏఈ నరేంద్ర, ప్రధానోపాధ్యాయులు ఎస్.అనురాధ, డి.మల్లిక, సీఆర్‌పీలు శ్రీదేవి, కవితా వాణి, ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు ఉన్నారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

డీఆర్‌డీఏ పీడీ వై హరిహరనాథ్

నెహ్రూనగర్: ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ ద్వారా ఉపాధి కల్పించేందుకు (నైపుణ్య శిక్షణ కళాశాల) స్కిల్ కాలేజీల్లో ఉచిత శిక్షణతో పాటు వసతి, ఉపాధి కల్పిస్తున్నట్లు డీఆర్‌డీఏ పీడీ వై.హరిహరనాథ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిధిలో ప్రొడక్షన్ డిజైన్ ఇంజినీర్ మెకానికల్, ఆటోమోటివ్ క్యాడ్ టెక్నిషియన్ కోర్సును స్కిల్ కాలేజీ, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ డాక్టర్ వైఎస్సార్ సివిల్ అండ్ ఇంజినీరింగ్ విభాగంలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కోర్సులో చేరేందుకు అభ్యర్థులు మెకానికల్, ఎరోనాటికల్, ఏరోస్పేస్‌లో ఇంజినీరింగ్, డిప్లొమో విద్యార్హత కలిగి ఉండాలన్నారు. పల్నాడు జిల్లా పరిధిలో సేల్స్ సూపర్‌వైజర్ కోర్సును స్కిల్ కాలేజీ, రెడ్డ సత్రం ఎదురు, కొండ కావూరు గ్రామం, కోటప్పకొండలో ఇంటర్, డిగ్రీ చదివిన నిరుద్యోగ యువతకు శిక్షణ ఇవ్వడం జరుగుందన్నారు. గుంటూరు జిల్లాకు చెందిన వారు - 8074597926, పల్నాడు జిల్లాకు చెందిన వారు - 7731822570, బాపట్ల జిల్లాకు చెందిన వారు 7569794587 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

కౌమార విద్యపై అవగాహన కల్పించండి

- ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ సుభాని
- జిల్లాస్థాయి రీసోర్స్ పర్సన్‌లకు శిక్షణ తరగతులు
- జిల్లా విద్యాశిక్షణ సంస్థలో 67 ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు హాజరు

యడ్లపాడు: కౌమారవిద్యపై సమగ్ర అవగాహన బాలికలకు రీసోర్సు పర్సన్లు అవగాహన కల్పించాలని డైట్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎం సుభాని తెలిపారు. గుంటూరు, తెనాలి, బాపట్ల విద్యాశాఖ డివిజన్లలోని 67 ఉన్నత పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు ఈ శిక్షణకు హాజరయ్యారు. ఉన్నత పాఠశాలల్లో అభ్యసించే బాలికలకు కౌమారదశలో వచ్చే మార్పుల గురించి అవగాహన కల్పించుకోవాలని కోరారు. శిక్షణ తరగతులను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ కౌమారదశలో పునరోత్పత్తి మార్గ అంటువ్యాధులు, లైంగిక పరంగా సంక్రమించే



ప్రారంభ సభలో మాట్లాడుతున్న డైట్ కళాశాల ప్రిన్సిపాల్ సుభాని

వ్యాధులు, హెచ్ఐవీ/ఎయిడ్స్ తదితర వ్యాధులు అవగాహన లోపంతో వస్తాయన్నారు. వాటి లక్షణాలు గుర్తించడం, అపోహలు తొలగించుకోవడం ఎంతో అవసరం అన్నారు. శిక్షణ తీసుకున్న రీసోర్సు పర్సన్లు తమ పాఠశాల్లో బాలికలకు కౌమర దశ విద్యపై బోధించాల్సి ఉంటుందని చెప్పారు. అనంతరం డైట్ కళాశాల ఉపన్యాసకులు శిక్షణ తరగతులు కొనసాగాయి. కార్యక్రమంలో డాక్టర్ కె.ప్రసాద్, కె.యోగేశ్వరరావు పాల్గొన్నారు.

నాట్కో సెంటర్ అభివృద్ధికి చర్యలు

డాక్టర్ కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: ప్రభుత్వ ఆసుపత్రి నాట్కో సెంటర్‌లో డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీని పటిష్టపరిచేందుకు ప్రత్యేకంగా ఎంపానల్మెంట్ చేస్తున్నట్లు గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ చెప్పారు. శుక్రవారం ప్రభుత్వ నాట్కో సెంటర్‌లో సెమినార్ హాలులో వైద్య నిపుణులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ నాట్కో సెంటర్‌లో జరిగే అభివృద్ధి పనులకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీని మరింతగా అమలు పర్చడానికి కృషి చేస్తున్నామన్నారు.. ప్రభుత్వ నాట్కో సెంటర్ నిర్వహణపై అంతర్గత కమిటీ చైర్మన్‌గా డాక్టర్ కిరణ్ కుమార్ నియమించింది. ప్రభుత్వ ఆసుపత్రి నాట్కో సెంటర్‌లో ఈ హెచ్ యస్ (ఎంప్లాయిమెంట్ హెల్త్ స్కీం)ను అమలు చేయడం కోసం వారికి ప్రత్యేక గదులను కేటాయించాలని ఆదేశించారు. నాట్కో సెంటర్ భవనంలోని మూడో అంతస్తులో ప్రత్యేక గదులను కేటాయిస్తున్నట్లు వెల్లడించారు. ఆసుపత్రి లోని వైద్యులు, వైద్య సిబ్బందితో పాటు ఇతర ఉద్యోగులకు ఈ వార్డులను కేటాయించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ నాట్కో సెంటర్‌లో ఆల్ట్రా సౌండ్ మిషన్ అవసరమని గుర్తించామని త్వరలో తీసుకుని రావడానికి ప్రణాళికలను సిద్ధం



వైద్యులతో మాట్లాడుతున్న డాక్టర్ కిరణ్‌కుమార్

చేస్తున్నామని చెప్పారు. పార్లమెంటు సభ్యుల ఫండ్స్ నుంచి నిధులను తీసుకుని వచ్చేందుకు వై.అశోక్ కుమార్ కృషి చేస్తున్నట్లు తెలిపారు. అల్ట్రా సౌండ్ మిషన్, ఎక్స్ రే, మెమోగ్రఫీ, సిటీ స్కాన్, పర్యవేక్షణకు ఒక అసిస్టెంట్ ప్రొఫెసర్‌ను నియమించాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు. క్యాన్సర్ పై పరిశోధన చేయాలని దానికి సరైన ప్రణాళికలను రూపొందించి ప్రతిపాదనలను వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ రీసెర్చ్ విభాగానికి పంపించాలని సూచించారు. ప్రభుత్వ నాట్కో కేంద్రాన్ని పర్యవేక్షించేందుకు వారంలో ఒకరోజు సమీక్ష సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హుమార్ బోర్డును ఏర్పాటు చేసి తద్వారా వైద్య విధానాన్ని పర్యవేక్షణ చేస్తామని చెప్పారు. సమావేశంలో సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకటసతీష్ కుమార్, డెప్యూటీ సివిల్ సర్జన్ ఆర్ ఎం ఓ డాక్టర్ ఝాన్సీ, డాక్టర్ దుర్గా ప్రసాద్, డాక్టర్ శివరామకృష్ణ, డాక్టర్ పోతిరెడ్డి వెంకట రెడ్డి, సమన్వయకర్త వై.అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

గుంటూరు రూరల్: విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలని కేంద్రియ విద్యాలయం ప్రిన్సిపల్ హనీమెహతా తెలిపారు. శుక్రవారం నల్లపాడు గ్రామంలోని కేంద్రియ విద్యాలయంలో కె.వి.ఎస్. ఫౌండేషన్ డే, క్రీడా దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కేంద్రియ విద్యాలయం 42వ వార్షిక క్రీడా దినోత్సవాన్ని జరుపుకోవటం సంతోషకరమన్నారు. అనంతరం ఎన్‌సీసీ క్యాడెట్స్, స్కౌట్ అండ్ గైడ్స్ విద్యార్థులు జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరాజుకు సాదర స్వాగతం పలికారు. ఎన్‌సీసీ క్యాడెట్స్ క్రీడా వందనాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులు చిన్నప్పటి నుంచి దేశభక్తి, సేవా దృక్పథం, క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలన్నారు. విద్యార్థులకు పలు క్రీడా పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థుల నృత్యాలు, ముగ్గుల పోటీలు ప్రేక్షకులను అలరించాయి.